

చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత దుస్తులు ధరించడంతోపాటు, ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. చేనేత దినోత్సవాన్ని ఉత్సాహంగా, అంకితభావంతో జరుపుకోవడమే కాకుండా గ్రామీణ వర్గాల వారిని ప్రోత్సహించాలని కోరారు. చేనేత పరిశ్రమ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడంతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక చేనేత కార్మికులు, చేతివత్తుల వారికి మద్దతు ఇవ్వడానికి దోహదపడాలని పేర్కొన్నారు. 1905లో స్వాతంత్ర్య సమరం తీవ్రంగా జరిగే రోజుల్లో ఆగస్టు 7న విదేశీ దుస్తులను బహిష్కరించాలని, స్వదేశీ దుస్తులను ధరించాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధానిలో ఈ ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు.

చేనేత రంగం కుదేలు..!

జిఎస్‌టితో నేతన్నల పరిస్థితి అయోమయం

నేడు చేనేత దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిరసన



ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వ విధానాలతో చేనేత రంగం కుదేలవుతోంది. చేనేతపై జిఎస్‌టి విధించడంతో నేతన్నల పరిస్థితి అయోమయంగా మారింది. రాజ్యాంగంలోని 43వ ఆర్టికల్ ప్రకారం కుటీర పరిశ్రమలకు ఎటువంటి పన్ను విధించకూడదని నిబంధన ఉన్నప్పటికీ కేంద్రం తుంగలోతొక్కి పట్టు, నూలుపై జిఎస్‌టి తగ్గించేందుకు ససేమిర అంటోంది. అయితే అడిగిందే తడవుగా సూరత్ జరీపై తగ్గింపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో చేనేత దినోత్సవం రోజున ఢిల్లీలో అఖిల భారత పద్మశాలీల చేనేత విభాగం ఆధ్వర్యంలో ఎర్రకోట నుంచి రాజ్ ఘాట్ వరకూ చేనేత మార్చ్ నిర్వహించి నిరసన తెలియజేయనున్నారు.

చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి దొంగదెబ్బ కొట్టింది. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) నుంచి చేనేత రంగానికి సంబంధించిన పట్టు, నూలు, రంగులను మినహాయించి కార్మికులను ఆదుకోవాలని పదేపదే ఆందోళనలు చేస్తున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. చేనేతను ఇంత నిర్లక్ష్యం చేసిన మోడీ సర్కార్ గుజరాత్ వ్యాపారులు అడిగిందే తడవుగా సూరత్ జరీపై జిఎస్‌టిని 12 నుంచి 5 శాతానికి తగ్గించింది. ఈ మేరకు తాజా జిఎస్‌సి కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం చేశారు. దీంతో చేనేత కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులు ఉన్నారు. వీరంతా చేనేతరంగంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాజ్యాంగంలోని 43వ ఆర్టికల్ ప్రకారం కుటీర పరిశ్రమలకు ఎటువంటి టాక్స్ విధించొద్దని నిబంధన ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నేతన్న నేస్తం కూడా పూర్తిస్థాయిలో అక్కరకు రాని పరిస్థితి ఏర్పడింది. ఈ పథకం అమలుకు సవాలక్ష నిబంధనలు పెట్టి నేతన్నలను ఇబ్బందులకు గురి చేస్తున్న పరిస్థితి.

దేశంలో ఉత్పత్తవుతున్న 90 శాతం జరీ ఉత్పత్తులు పట్టణంలోనే తయారవుతున్నాయి. 2017లో జిఎస్‌టి పన్నుల విధానం అమల్లోకి వచ్చినప్పుడు రియల్, ఇమిటేషన్ జరీలపై 12 శాతంగా జిఎస్‌టి వేయాలని నిర్ణయించారు. సూరత్‌కు చెందిన వ్యాపారులు, స్థానిక నాయకత్వం, గుజరాత్ ప్రజా ప్రతినిధులు రియల్ జరీ పన్నును 5 శాతానికి తగ్గించుకున్నారు. మరలా ఇప్పుడు సూరత్ వ్యాపారులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఇమిటేషన్ జరీపై ఉన్న 12 శాతం జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించుకున్నారు. మిల్లులపై ఉత్పత్తి చేసే బట్టలపై విధించే పన్నులు, చేనేత మగ్గంపై తయారు చేసే బట్టలపై విధిస్తున్న పన్నులు ఒకే స్లాబ్ కింద ఉండకూడదని దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు మొదటి నుంచీ వాదిస్తున్నారు. పవర్ లూమ్స్‌తో హ్యాండ్లూమ్ పోటీ పడలేదని తెలిసి కూడా కేంద్రం ఆ రెండింటినీ ఒకే గాటున కట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టుపై 19 శాతం, నూలుపై 5 శాతం, రంగులపై 5 శాతం జిఎస్‌టి కొనసాగుతోంది. పవర్ లూమ్స్‌లోనూ ప్రస్తుతం నూలు, పట్టు వినియోగిస్తున్నారు. కానీ ఎక్కువ మోతాదులో ఫ్లోరా జరీ దారాన్ని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మోడీ సర్కార్ జరీపై జిఎస్‌టిని 7 శాతం మేర నూలుతో సమానంగా 5 శాతానికి చేసింది. దీంతో చేనేత కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చలించని కేంద్రం..

కేంద్రంలోని బిజెపి సర్కారు అధికారం చేపట్టినప్పటి నుంచి చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2017 నుంచి చేనేతపై 5 శాతం జిఎస్‌టి విధించింది. నాటి నుంచి జిఎస్‌టి తొలగించాలని చేనేత కార్మికులు, సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు దాదాపు 82 మంది పార్లమెంటు సభ్యులు చేనేత మహా వస్త్ర లేఖపై సంతకాలు కూడా చేశారు. చేనేత రంగాన్ని జిఎస్‌టి నుంచి మినహాయింపు ఇవ్వాలని కొనసాగుతున్న ఉద్యమానికి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలు, 21 రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. అయినా కేంద్రం చలించడం లేదు.

నేడు ఢిల్లీలో నిరసన

ఈనెల ఏడో తేదీన చేనేత దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో అఖిల భారత పద్మశాలీల చేనేత విభాగం ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నారు. కోస్తాంధ్రతో పాటు ఉమ్మడి జిల్లాల నుంచి నేతన్నలు, సంఘం నాయకులు వేలాదిగా తరలివెళ్లారు. ఢిల్లీ ఎర్రకోట నుంచి రాజ్‌ఘట్ వరకూ లక్ష మందితో చేనేత మార్చ్ నిర్వహించి నిరసన తెలపనున్నారు.



కేంద్ర ప్రభుత్వ విధానాలు దారుణం..

జివి.నాగేశ్వరరావు, కోస్తాంధ్ర పద్మశాలీల సంఘం అధ్యక్షులు

మోడీ ప్రభుత్వం జిఎస్‌టి రూపంలో చేనేత ఉత్పత్తులపై 5 శాతం పన్ను, రంగులు, రసాయనాలపై 18 శాతం పన్ను విధించింది. భారతీయత, విశ్వగురువు, స్వదేశీ అంటూ నినాదాలు చేసే బిజెపి మాటలకు భిన్నంగా చేనేత కళాకారుల చెమటపై పన్నులు వేసింది. చేనేతపై పన్నులు వేయడంతో పాటు అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం తొలగించింది. పన్ను తొలగించాలని గతేడాదిన్నరగా ప్రభుత్వాన్ని వివిధ రకాలుగా కోరుతున్నాం. అయినా పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వ విధానాలు అత్యంత దారుణంగా ఉన్నాయి.

జిఎస్‌టిని ఎత్తివేయాలి..

బళ్ల పరమేశ్వరరావు,
కోస్తాంధ్ర పద్మశాలీల సంఘం యువజన విభాగం అధ్యక్షులు



మోడీ సర్కార్ ఆది నుంచీ కార్పొరేట్లకు కొమ్ము కాస్తోంది. కేవలం గుజరాత్ జరీ పరిశ్రమ రక్షణ కోసం మాత్రం జిఎస్‌టిని 7 శాతానికి తగ్గించింది. కేంద్రం ఇప్పటికైనా వివక్ష పూరిత విధానాలు మార్చుకోవాలి. లేదంటే మూల్యం చెల్లించక తప్పదు. చేనేతకు సంబంధించిన పట్టు, నూలు, రంగులపై జిఎస్‌టిని ఎత్తివేయాలి.

3 సర్పంచి, 27 వార్డులకు ఎన్నికలు

నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్

8 నుంచి నామినేషన్లు, 19న ఎన్నికలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వివిధ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న సర్పంచి వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఆదివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. పశ్చిమగోదారిలో జిల్లాలో 15 మండలాల పరిధిలోని 29 పంచాయతీల్లో మూడు సర్పంచి పదవులకు, 28 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇరగవరం మండలం కావలిపురం, పాలకొల్లు మండలం అగర్తిపాలెం, యలమంచిలి మండలం దొడ్డిపట్లలో పంచాయతీ సర్పంచి ఎన్నికలు జరగనుండగా, వివిధ పంచాయతీల్లో 28 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి ఎనిమిదో తేదీ నుంచి పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న విత్‌డ్రా తుది జాబితా ప్రక్రియ సాగనుంది. 19వ తేదీన ఉదయం ఏడు గంటల మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల పోలింగ్, రెండు గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది.

9 నుంచి 'నా మట్టి - నా దేశం' : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా నా మట్టి.. నా దేశం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో 'నా మట్టి - నా దేశం, నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం' ప్రత్యేక కార్యక్రమంపై అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. దేశ సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన స్థానిక మహనీయులను, సాహసవంతులను, వీరులను స్మరించుకోవాల్సి ఉందని తెలిపారు. ఈ నెల 9వ తేదీన అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సందేశంతో పాటు దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ అమృత్ సరోవర్లు, నీటి వనరుల వద్ద జ్ఞాపక శిలాఫలకాలను ఏర్పాటు చేసుకొని సెల్ఫీలు దిగి నిర్ణీత వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రధానంగా జిల్లాలో ఎంపిక చేసిన అమత్ సరోవర్లు, పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి కార్యక్రమంలో ప్రజలందరూ మట్టిని గాని, మట్టి దీపాన్ని గాని చేతిలో ఉంచుకొని పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయాలని తెలిపారు. శిలాఫలకాల చుట్టూ మట్టి దీపాలను వెలిగించాలని తెలిపారు. 10వ తేదీన పంచప్రాణ ప్రతిజ్ఞ రెండో సెల్ఫీ తీసుకొని అప్లోడ్ చేయాలని తెలిపారు. 11న వసుధకు వందనం పేరుతో 75 మొక్కలు నాటాలని తెలిపారు. 14న వీరులకు వందనం చేపట్టి మరణించిన వీరుల కుటుంబాలను, జీవించి ఉన్న వీరులను సత్కరించాలని తెలిపారు. 15న జాతీయ జెండా ఎగురవేయాలని, 16 నుండి 20వ తేదీ వరకూ మండలాలు, పెద్ద మున్సిపాల్టీల్లో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పలు కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మండలాలకు చెందిన యువత వారి ప్రాంతాల్లోని మట్టిని కళశంలో తీసుకుని ఢిల్లీకి ప్రయాణమై 27, 28 తేదీలలో ఢిల్లీకి చేరుకుని అక్కడ కర్తవ్యపద్‌లో జరిగే ముగింపు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సంక్షేమ బోర్డుకు నిధులు జమచేయాలి

బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రమణారావు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులు రూ.11.50 కోట్లు తిరిగి బోర్డుకు చెల్లించాలని ఎపి బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమణారావు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కార్మిక ద్రోహి అన్నారు. ఎక్కువగా కార్మికులకు నష్టం చేశారని విమర్శించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికులకు వర్తించే సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తూ 12 /14 మెమో జారీ చేయడంతో మొత్తం పథకాలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాలు తుంగలో తొక్కి కార్మికులకు నష్టం కలిగించే విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను కదిలించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల నిర్మాణరంగం వ్యయం పెరిగి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. ధరలు, పన్నుల భారాలు పెరిగిపోవడం వల్ల కార్మిక కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 9న క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా జరిగే మహా ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండ సూరిబాబు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వీరవల్లి మాధవరావు, కేతా నాగాంజనేయులు, పొట్టి పోతుల మధుసూదన్‌రావు, ఆకుల రాజు, బాతు నాగేశ్వరరావు, కొమ్మన బాబు పాల్గొన్నారు

కొత్త జిల్లాలో రైల్వే స్టేషన్ల అభివృద్ధి అభినందనీయం

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సామాన్యుడు సైతం తక్కువ ఖర్చుతో ఎక్కువ కిలో మీటర్లు ప్రయాణించే అవకాశం మన భారత రైల్వేకి మాత్రమే ఉందని, కొత్త జిల్లాలో రూ.73.05 కోట్లతో మూడు రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేయడం అభినందనీయమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. ప్రధాన నరేంద్ర మోడీ చేతుల మీదుగా న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశ వ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్లు పునరాభివృద్ధికి లాంఛనంగా శంకుస్థాపన వర్చువల్‌గా చేశారు. ఆదివారం భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని తిలకించడానికి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, శాసనసభ్యులు మంతెన రామ రాజు, రైల్వేశాఖ అధికారులు, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోషేనురాజు మాట్లాడుతూ జిల్లాలో మూడు రైల్వే స్టేషన్ల అభివృద్ధి చాలా సంతోషించాల్సిన విషయం అన్నారు. నరసాపురం పార్లమెంటు నియోజకవర్గంలో రూ.73.05 కోట్లతో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం స్టేషన్లలో పార్కింగ్, విశ్రాంతి మందిరాలు, స్టాల్స్ ఆధునిక సౌకర్యాలతో సుందరవదనంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాకు ప్రధాన కేంద్రం భీమవరం కావడంతో ప్రయాణికుల తాగిడి ఎక్కువగా ఉంటుందని, అందుకు అనుగుణంగా స్టేషన్లు అభివృద్ధి చేయడం శుభపరిణామం అన్నారు.



రైల్వే పనులు ప్రారంభిస్తున్న శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

రాష్ట్రంలో మొత్తం 18 స్టేషన్లు ఎంపికకాగా అందులో పశ్చిమలో మూడు స్టేషన్లు ఉండటం విశేషం అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అమృత్ భారత్‌లో భాగంగా స్టేషన్లు అభివృద్ధి శిలాఫలకాన్ని మోషేనురాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ), బిజెపి నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : స్థానిక రైల్వేస్టేషన్లో ఆదివారం జరిగిన అమృత్ భారత్ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొని ప్రధాని ఢిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్యక్రమాన్ని ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం నిర్వహిస్తున్న అమృత్ భారత్‌లో పశ్చిమగోదావరి జిల్లా దేశంలోనే రికార్డుగా నిలిచిందన్నారు. మరెక్కడా లేని విధంగా జిల్లాలో ఈ పథకం కింద మూడు రైల్వే స్టేషన్లు ఎంపికవడం మంచి తరుణం అన్నారు. రాష్ట్రంలో మొత్తం 18 స్టేషన్లు ఎంపికకాగా అందులో పశ్చిమలో మూడు స్టేషన్లు ఉండటం విశేషమన్నారు. ఈ మూడు స్టేషన్లకు సుమారు రూ.73.05 కోట్లు కేటాయించారని తెలిపారు. నరసాపురం స్టేషన్‌కు రూ.25.7 కోట్లు, తాడేపల్లిగూడెం స్టేషన్‌కు రూ.27.13 కోట్లు, భీమవరం స్టేషన్‌కు రూ.22.13 కోట్లు చొప్పున మంజూరయ్యాయన్నారు. ఇందుకు రాష్ట్రంలో 18 స్టేషన్లకు సుమారు రూ.454 కోట్ల నిధులు ఖర్చు చేయనున్నారని తెలిపారు. కోనసీమ పశ్చిమగోదావరి జిల్లాను కలుపుతూ వశిష్ట వారధి వంతెన నిర్మాణం పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలో నరసాపురం రైల్వే స్టేషన్ రూపురేఖలు మారబోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీను, రైల్వే అడ్వయిజరీ కమిటీ బోర్డు సభ్యులు జక్కంపూడి కుమార్ విజయవాడ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న నేతలు

బిజెపికి పాలించే అర్హత లేదు

సిఐటియు ఆధ్వర్యాన మానవహారం

ప్రజాశక్తి - తణుకురూరల్

దేశ స్వాతంత్ర్యాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బిజెపికి పాలించే అర్హత లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విమర్శించారు. ఆదివారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో 'మోడీ బారి నుంచి - సేవ్ ఇండియా సేవ్' అనే పేరుతో సిఐటియు ఆధ్వర్యంలో మానవహారం, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ 76వ స్వాతంత్ర్య దినోత్సవంలోకి అడుగు పెడుతున్నప్పటికీ కుల, మత, ప్రాంతం పేరుతో పాలకులు ఘర్షణలు సృష్టించడం సిగ్గుచేటన్నారు. నూతన టెక్నాలజీతో ఆధునిక ప్రపంచంవైపు సాగుతున్న తరుణంలో అనాగరిక పద్ధతులతో కొన్ని శక్తులు వెనక్కి తీసుకెళు తున్నాయన్నారు. అమర వీరులు కన్న కలలు నేటికీ కలలుగానే మిగిలిపోతున్నాయని తెలిపారు. నేటికీ అందరికీ విద్య, ఉపాధి, గూడు, గుడ్డ, వైద్యం వంటివి అందని ద్రాక్షలా ఉన్నాయని పేర్కొన్నారు. బిజెపి తన అధికారం కోసం సిఎఎ, యుసిసి వంటి వాటిని తీసుకొచ్చి ప్రజలు మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. బిజెపి విధానాలను విమర్శించే వారిని దేశ ద్రోహులుగా మోడీ చెప్పడం హాస్యాస్పదం అన్నారు. దేశ స్వాతంత్ర్యాన్ని మోడీ బారి నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు, యువత, అభ్యుదయవాదులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, ఎన్.ఆదినారాయణ బాబు, కె.అయ్యప్ప, శ్రీనివాస్‌రాజు, వైటి రామకృష్ణ పాల్గొన్నారు.

సూర్యనారాయణరాజు సేవలు మరువలేనివి

రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి

ప్రజాశక్తి - కాళ్ల

రైతుల సంక్షేమమే ధ్యేయంగా మంతెన వెంకట సూర్యనారాయణరాజు నిరంతరం కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్. నాగిరెడ్డి అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో మంతెన సూర్యనారాయణ రాజు ప్రథమ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. తొలుత సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఆనాటి ఉద్యమాలు.. నేటి ఉద్యమాలకు అంతరమనేది చాలా ఎక్కువ కనిపిస్తోందన్నారు. రైతు సమస్యలతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం సూర్యనారాయణ రాజు ఎంతో పోరాడారని తెలిపారు. ఒఎన్‌జిసి ఆయిల్ పంపించడం వల్ల భూమి కుంగి పోతుందని, పెద్ద ఎత్తున పోరాటం చేయడంలో సూర్యనారాయణ రాజు కృషి ఎనలేనిదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలని ఎంతో పరితపించారని తెలిపారు. కృష్ణా గోదావరి డెల్టాల పరిరక్షణ, కొల్లేరు పర్యావరణ పరిరక్షణ చేయాలని నిరంతరం పోరాడిన మహనీయుడు అని గుర్తు చేశారు. రైతు సమైక్య అధ్యక్షులు ఎర్నేని నాగేంద్రనాథ్ మాట్లాడుతూ కృష్ణా గోదావరి డెల్టా పరిరక్షణ కోసం పాటుపడ్డారన్నారు. నేటి తరానికి ఆదర్శవంతమైన నాయకులని గుర్తు చేశారు. రాష్ట్ర రైతు సేవా సంస్థ జనరల్ సెక్రటరీ అక్కినేని భవానీప్రసాద్ మాట్లాడుతూ సూర్యనారాయణ రాజు దేశ స్వాతంత్ర్యం కోసం, రైతుల కోసం నిస్వార్థంగా సేవలందించారన్నారు. రాష్ట్ర రైతు నాయకులు చెరుకూరి వేణుగోపాల్ మాట్లాడుతూ రైతు కార్యాచరణ సమితి నాయకులు సూర్యనారాయణరాజు ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా కలిదిండి మండలం నరసింహపురం గ్రామానికి 3 వేల లీటర్ల కొత్త తాగునీటి ట్యాంకర్‌ను రాష్ట్ర వ్యవసాయ మండలి వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి, కైకలూరు ఎంఎల్‌ఎ డి.నాగేశ్వరరావు ప్రారంభించారు. రైతుల కోసం పాటుపడిన పలువురు రైతు కార్యాచరణ సమితి నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు నాయకులు త్రినాద్ రెడ్డి, ఎంఎల్‌ఎలు మంతెన రామరాజు, దూలం నాగేశ్వరరావు, ఉండి మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, అటవీశాఖ రాష్ట్ర డైరెక్టర్ మంతెన యోగేంద్ర బాబు, టిటిడి మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, జనసేన నాయకులు జుత్తిగ నాగరాజు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి అధ్యక్షులు పాతపాటి మురళీరామరాజు, గౌరవాధ్యక్షులు కలిదిండి గోపాలకృష్ణంరాజు, అధికార ప్రతినిధి కలగ కమలాకర శర్మ, సమితి కోశాధికారి మంతెన వెంకట రవివర్మ, కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, సమితి కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, వైస్ ఛైర్మన్ నాగబాబు, జాయింట్ సెక్రటరీలు దాట్ల లక్ష్మీపతి రాజు, మేళం దుర్గాప్రసాద్, కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి టెక్నికల్ అధికార ప్రతినిధి జి.కృష్ణారావు, డాక్టర్ గోపాలరాజు, రమణరాజు, సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.




రైతు కార్యాచరణ నాయకులను సత్కరిస్తున్న ప్రతినిధులు

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - కాళ్ల

తమకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని ఏలూరుపాడు రైతులు రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్.నాగిరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. గత సార్వాలో వర్షాల వల్ల నష్టపోయామని, 25 మంది రైతులకు గాను 1,49,500 నష్టపరిహారం రావాలని తెలిపారు. ఆ సొమ్ము ఇప్పించి న్యాయం చేయాలని రైతులు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామ సర్పంచి భూపతి రాజు జగ్గరాజు, ఎంపిటిసి చిన్నాపరాపు రాంబాబు, వైసిపి అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, నాయకులు పడమట సతీష్, రైతులు ఉన్నారు.



నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నేతలు

సాగరతీరాన.. పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ద్విచక్ర, ప్రత్యేక వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తేన్నెలపై ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. అనంతరం ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.



సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఇఒ నాగేశ్వరరావు

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : ఎంఇఒ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడి గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు వెంటనే కల్పిస్తామని ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల ఐదో తేదీన గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కరువు శీర్షికన ఈ నెల ఐదో తేదీన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు డిఇఒ ఆర్‌వి.రమణ స్పందించి ఎంఇఒ నాగేశ్వరరావును గురుకుల పాఠశాలను పరిశీలించాలని ఆదేశించారు. ఆయన గురుకుల పాఠశాలను ఆదివారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు.


నిత్యావసరాలు అందిస్తున్న సరిత

అనాధ ఆశ్రమానికి నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఉన్న చిన్న పిల్లల అనాధ ఆశ్రమానికి వైసిపి నేత, అడ్వకేట్ కర్రా జయ సరిత రూ.ఆరు వేల విలువైన నిత్యావసర సరుకులు, రూ.ఆరు వేల నగదు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా జయసరిత మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆమె కోరారు. ఆమెకు అనాధ ఆశ్రమం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

రోగికి వసుధ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

మొగల్తూరు మండలంలోని కోమటి తిప్ప గ్రామ నివాసి కలిదిండి సత్యరాజు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనకు సొంత ఇంటి స్థలం, వ్యవసాయ భూమి లేవు. ఆయన ప్రస్తుతం కాలువ గట్టుమీద నివాసం ఉంటున్నాడు. సత్యరాజు పరిస్థితిని పాలకొల్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు, ఛైర్మన్ వెంకట రామరాజులకు తెలిపారు. వెంటనే వెంకటరామరాజు స్పందించి రూ.పదివేల చెక్కును పంపించారు. ఆదివారం పాలకొల్లులో బుద్ధరాజు ఇంటి వద్ద సత్యరాజు భార్య సుందరమ్మకు ఆ చెక్కును అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద భూపతిరాజు ప్రసాదరాజు పాల్గొని మాట్లాడుతూ తమ గ్రామంలో కుటుంబానికి సహాయం చేసినందుకు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్‌కు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. సహాయాన్ని అందుకున్న సుందరమ్మ ఫోన్ ద్వారా వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలో మెరుగైన పారిశుధ్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త వేసేందుకు వేర్వేరు రంగుల బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల తయారీకి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు బుట్టలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని గ్రామ ప్రజలు ఉపయోగించుకోవాలని వారు సూచించారు. చెత్తబుట్టల పంపిణీ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకట తాత నాయుడు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మార్టేరులో కిడ్నాప్ కలకలం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరులో ఇద్దరు చిన్నారుల కిడ్నాప్ కలకలం రేపింది. బయటకు వెళ్లిన ఇద్దరు చిన్నారులను గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేసినట్లు పోలీసులు సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మార్టేరుకు చెందిన షేక్ శుభనిల్, షేక్‌ఆశాబేగం దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు షేక్‌రంజాన్ ఐదో తరగతి, చిన్న కుమారుడు షేక్ జాకీర్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల నాలుగో తేదీ సాయంత్రం వారు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. మళ్లీ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు అన్నిచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి షేక్‌ఆశాబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి మార్టేరు సెంటర్‌లో సీసీ ఫుటేజీ పరిశీలించారు. వ్యక్తి ఇద్దరు చిన్నారులను కిడ్నాప్ చేసినట్లు గుర్తించి దర్యాప్తు చేపట్టారు.


షేక్‌రంజాన్ (ఫైల్)


షేక్‌జాకీర్ (ఫైల్)

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉండి

అవమానభారంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉండి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సీతారాంపేటకు చెందిన యువకుడు పాసిపెంట సురేష్(27) ఈ నెల నాలుగో తేదీ సాయంత్రం తన స్నేహితుని పుట్టినరోజుకు కేకు తీసుకురావడం కోసం స్థానికంగా ఉన్న ఒక బేకరీకి వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న బొండాడ భవాని అనే యువతితో అసభ్యంగా ప్రవర్తించగా ఆమె చెప్పుతో కొట్టింది. అనంతరం సురేష్ ఇంటికి బండాడ భవాని తన తల్లిని తీసుకెళ్లి సురేష్ భార్య సాయిలక్ష్మితో గొడవపడి దుర్భాషలాడుతూ కొట్టింది. బొండాడ భవాని తన భార్యను కొట్టి నలుగురిలో పరువు తీసిందని మనస్తాపానికి గురైన సురేష్ శుక్రవారం సాయంత్రం కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు అతడిని వెంటనే భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లారు. విజయవాడలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం సాయంత్రం మృతి చెందాడు. తన భర్త మరణానికి కారకురాలైన బొండాడ భవానిపై మృతుని భార్య సాయిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుని అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన పిడకల మహాలక్ష్మణుడు (75) గత నెల 25వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.

చెత్త కుప్పలు.. ప్రజల అవస్థలు

దుర్వాసనతో ఇబ్బందులు, విజృంభిస్తున్న దోమలు

రోగాల బారిన పడతామని భయాందోళన


వెంకయ్యవయ్యేరు గట్టుపై చెత్త

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం వెంకయ్య వయ్యేరు గట్టు చెత్తాచెదారాలతో నిండిపోయి దుర్వాసన రావటంతో రహదారి వెంట వెళ్లేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఒక పక్క ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ జగనన్న సంకల్పం పారిశుధ్య నిర్మూలనపై ర్యాలీ నిర్వహిస్తున్నా చెత్తా చెదారాలు తీయించడంలో అధికారులు స్పందించడంలేదు. దీంతో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయి చిన్నపాటి డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తచెదారం గట్టుపై వేయడంతో వయ్యేరులో నీరు కలుషితమవుతుంది. అయినా స్థానిక ఇరిగేషన్ అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము అనారోగ్యం బారిన పడతామని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గట్టుపై చెత్తను తీయించాలని, ఎక్కడపడితే చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జగన్ పాలనలో మహిళలకు గుర్తింపు : మంత్రి వనిత

ప్రజాశక్తి - తణుకు

సిఎం జగన్ పరిపాలనలోనే మహిళలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం, దళిత సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తొలుత ప్రజా గాయకుడు గద్దర్ మృతికి మంత్రులు వనిత, కారుమూరి, నాగార్జున, ఎంఎల్‌సి కొయ్యే మోషేన్‌రాజు సంతాపం వ్యక్తం చేసి మౌనం పాటించారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన వనిత మాట్లాడుతూ దేశంలో ఏ విధంగా లేని విధంగా వాలంటీర్ గ్రామ సచివాలయ వ్యవస్థల ద్వారా పేద ప్రజలకు ఇంటింటికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఎంఎల్‌సి కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ జగన్ అధికారంలోకొచ్చాక ఎస్‌సి ఎస్‌టి బిసి వర్గాలకు చెందిన వారికి రాజ్యాంగ అధికార పదవులు లభిస్తున్నాయని చెప్పారు. రైతులకు, వ్యవసాయదారులకు మేలు జరిగేలా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రైతులకు మద్దతు ధర నుంచి విత్తనాల వరకు అన్నీ కూడా సమకూర్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున మాట్లాడుతూ రైతు పక్షపాతిగా జగన్ ఉన్నారన్నారు. రాష్ట్రంలో 31 లక్షల ఇల్లు పేదలకు ఇచ్చి సామాజిక విప్లవానికి నాంది పలికారన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో దళితులకు రాజ్యాంగ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. తొలుత ఎఎంసి ఛైర్మన్‌గా నక్క కృష్ణవేణి, వైస్ ఛైర్మన్‌గా మారిశెట్టి శివశంకర్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు, రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెమ్మ ఆనంద్‌ప్రకాష్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, మాజీ ఎంఎల్‌సి జూపూడి ప్రభాకర్ పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

భీమవరం : ప్రజాగాయకుడు గద్దర్ మృతికి సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలిపింది. ఈ మేరకు జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గద్దర్ తన గళం, ఆట, పాటతో అభ్యుదయ, ప్రజా ఉద్యమాలకు ఎంతో ఊతం ఇచ్చారన్నారు. లక్షలాది ప్రజలను చైతన్య పర్చారన్నారు. గొప్ప గుర్తింపు, ప్రజాభిమానం పొందిన ప్రజా కళాకారుడైన ఆయన మృతి తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు, అభిమానులకు సానుభూతి తెలిపారు.

తణుకు : ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళికుమార్ సంతాపం వ్యక్తం చేశారు. మంచి గాయకున్ని కోల్పోయమన్నారు. విప్లవ ఉద్యమాన్ని, దళిత ఉద్యమాన్ని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని తన గానం ద్వారా ప్రజలకు వినిపించారన్నారు. ఆయన ఆశయ సాధనకు నడుంబిగించడమే ప్రజా ఉద్యమాల కర్తవ్యమన్నారు. ఆయన మృతి తీరని లోటు అన్నారు.

భీమవరం రూరల్ : జానపద పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జానపద పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని, ముఖ్యంగా దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గద్దర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఎన్నో జానపద గీతాలు ఆయన నోటివెంట వెలువడ్డాయని తెలిపారు. గద్దర్ మృతి తీరని లోటన్నారు.

పాలకొల్లు : విప్లవ గాయకుడు గద్దర్ ఆకస్మిక మరణం వామపక్ష భావజాలం ఉన్నవారికి తీరని లోటు అని సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ తమ సంతాపాన్ని తెలిపారు. ఎందరో విప్లవకారులకు ఆయన ఆదర్శంగా ఉన్నారని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. గద్దర్ మృతికి ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వలవల శ్రీరామమూర్తి, ప్రజా నేతలు చల్లా సోమేశ్వరరావు, యర్రా అజయ్, ఐద్వా సీనియర్ నేత అరటికట్ల నారాయణమ్మ, పట్టణ కార్యదర్శి బాసిన శ్యామల సంతాపం తెలిపారు.

మొగల్తూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రమైన మొగల్తూరులోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1993- 94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు కలుసుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. కేకును కోసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపల్లి అనిల్, కారుమూరి రవి, చిక్కల శ్రీనివాస్, చీగటపు నాగేశ్వరరావు, కొత్తపల్లి దొరబాబు, దోసనపూడి రాజా, ఓలేటి మధు, వెలుగట్ల రమణ, పులపర్తి రాఘవ పాల్గొన్నారు.

పాలకొల్లు యునైటెడ్ కాపు క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు యునైటెడ్ కాపు వనిత క్లబ్ అధ్యక్షురాలు మంగిన అరుణ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు బెంచీలను ఏర్పాటు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, డాక్టర్ దాసరి నారాయణరావు విగ్రహం వద్ద ప్రజలు కూర్చోవడానికి బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ సంజయ్ మాట్లాడుతూ కాపు వనిత క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. క్లబ్ అధ్యక్షురాలు మంగిన అరుణ మాట్లాడుతూ భవిష్యత్తులో వనిత క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి యామన విజయలక్ష్మి, చిడే శిరీష, కర్రె రేవతి, యర్రంశెట్టి అనూష, అడబాల జ్యోతి, నారిన సూర్యకుమారి, మల్లిపూడి లక్ష్మి, కాపు క్లబ్ అధ్యక్షులు గాది ఆంజనేయులు, కార్యదర్శి పస్యావుల రవి, మాజీ కార్యదర్శి జక్కంపూడి మదన్, మంగిన సాయి పాల్గొన్నారు.

రైతులతో విద్యార్థులు మమేకం


రైతులతో మాట్లాడుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

ప్రజాశక్తి - వీరవాసరం

వ్యవసాయ రంగాన్ని ఒక అంశంగా ఎన్నుకుని ప్రాజెక్టు వర్కు కోసం బాలేపల్లి వచ్చి రైతులతో మమేకమవడం సంతోషంగా ఉందని భీమవరం బివి.రాజు కళాశాలకు చెందిన విద్యార్థులు అన్నారు. ఈ కళాశాలలో ఇఇఇ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొంత మంది విద్యార్థులు వ్యవసాయ రంగాన్ని ప్రాజెక్టుకు వర్కుగా ఎన్నుకుని ఆ రంగంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దిగుబడి, యాంత్రీకరణ వంటి విషయాలపై చర్చించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఎలా పొందాలి, వర్షాల వల్ల రైతులు ఎదుర్కొనే ఇబ్బందులు, నష్టాలపై విద్యార్థులు వారితో చర్చించారు. పెట్టిన పెట్టుబడికి గిట్టుబాటు ధర ఎంత వస్తుందనే విషయమై సుదీర్ఘంగా చర్చించారు. ఇదే విధంగా ఇటీవల ప్రభుత్వం తీసుకురానున్న డ్రోన్ వ్యవసాయంపై రైతుల అభిప్రాయాలను విద్యార్థులు తెలుసుకున్నారు. కోత మిషన్ల ద్వారా వరి కోతలు కోయడం వల్ల తేమ శాతాన్ని ఎలా తగ్గించుకోవచ్చో విద్యార్థులు రైతులకు వివరించారు. వీరికి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ సత్యకళ, వాలంటీర్ నాని సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు షణ్ముఖ, రేవంత్, అభిషేక్ పాల్గొన్నారు.

సాగు పెట్టుబడి రూ.10 వేలు అందించాలి

ప్రజాశక్తి - తణుకు

రైతులకు, కౌలు రైతులకు ప్రతి ఎకరాకు సాగు పెట్టుబడిగా రూ.పది వేలు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ ఈ నెల ఏడో తేదీన ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న రైతు ధర్నా విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోణాల భీమారావు కోరారు. ఈ మేరకు స్థానిక సంఘం కార్యాలయంలో ధర్నా వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ వ్యవసాయ సాగు పెట్టుబడి పెరిగి రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తరహాలో ఎపి ప్రభుత్వం కూడా రైతులకు ఎకరాకు రూ.పది వేలు అందించాలని కోరారు. అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ ఉపకరణాలు 90 శాతం రాయితీతో అందించాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్ల బిగించే ఆలోచన ఉపసంహరించుకోవాలని, సర్వే నెంబర్ ప్రకారం పంటల బీమా పథకం అమలు చేయాలని, రైతులకు, కౌలు రైతులకు పంట రుణాలు రూ.రెండు లక్షల వరకు మాఫీ చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, నెక్కంటి క్రాంతికుమార్, టి.అప్పలస్వామి పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యసభ సభ్యులు వెంకటరమణరావు పుట్టినరోజు

ప్రజాశక్తి - భీమవరం


చిన్నారులకు దుస్తులు అందిస్తున్న పృధ్వీరాజు, పూర్ణచంద్రరావు

భీమవరంలో రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణరావు పుట్టినరోజు వేడుకలను ఆదివారం వైసిపి సీనియర్ నాయకులు పిన్నమ్మరాజు పృధ్వీరాజు, రాష్ట్ర ప్రభుత్వ బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బంధన పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన అమిరంలో ఉన్న ఇమ్మానియేల్ చిల్డ్రన్స్ హోమ్‌లో కేక్‌ని కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అనాధాశ్రమంలోని విద్యార్థులకు యూనిఫామ్, దుప్పట్లు, పండ్లు పృధ్వీరాజు, పూర్ణచంద్రరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న మోపిదేవి వెంకటరమణరావు పుట్టినరోజు వేడుకలు భీమవరంలో నిర్వహించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనాధ అశ్రమంలో చిన్నారుల మధ్య ఈ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మోపిదేవి వెంకటరమణరావు మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకొని రాష్ట్రంలోని పేద ప్రజల అభ్యున్నతికి మరింత పాటు పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు బి.ఎర్నెస్ట్ పాల్, మోపిదేవి యూత్ నాయకులు కొండేటి లాజర్, పోతురాజు అశోక్ కుమార్, ప్రసాద్, బస్వాని హేమేంద్రవర్మ, మణికంఠ, నాగబాబు పాల్గొన్నారు

ఉండిలో వైసిపి జెండా ఎగరేస్తాం

నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - కాళ్ల

వచ్చే ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురవేసేందుకు అందరూ సమిష్టి కృషి చేయాలని వైసిపి నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. మండలంలోని పెదఅమిరంలో వైసిపి కార్యాలయంలో ఆదివారం నియోజవర్గ నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు, గోకరాజు రామరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ పొత్తులు లేకుండా ఎన్నికలకు వెళ్లలేని అసమర్ధ నాయకుడు చంద్రబాబు అని, రానున్న ఎన్నికల్లో ఇద్దరు అసమర్ధ నాయకులను ఎదుర్కోవాల్సి ఉందన్నారు. ఉన్నతమైన సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పార్టీలో ఉన్న సమస్యలను సరిచేసి పార్టీ నిర్ణయించిన అధ్యక్షుడిని గెలిపించుకోవడానికి అందరూ సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పూర్తిస్థాయిలో వారానికి రెండు రోజులు నియోజకవర్గానికి సమయాన్ని కేటాయిస్తానన్నారు. ప్రతి మండలం తిరిగి అందర్నీ సమన్వయం చేసుకొని పార్టీ బలోపేతానికి, ఎన్నికల్లో గెలుపు కోసం కషి చేస్తానన్నారు. ఉండి నియోజకవర్గంలో పివిఎల్ నరసింహరాజును ఎంఎల్ఎగా గెలిపించుకోవడానికి అందరూ కష్టపడాలని కోరారు. ఈ సమావేశంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, టిడిపి బోర్డు మాజీ మెంబర్ గోకరాజు రామరాజు మాట్లాడారు. కాళ్ల, ఉండి, పాలకోడేరు మండలాల జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, రణస్థల కనకదుర్గ మహంకాళి, పి.లక్ష్మీతులసి, ఎంపిపిలు పెనుమత్స విశ్వనాథరాజు, భూపతిరాజు చంటిరాజు, కటారి విజయలక్ష్మి, ఇందుకూరి శ్రీహరిరాజు, మండల కన్వీనర్లు పెనుమత్స ఆంజనేయరాజు, గుండుగోలను ధనరాజు, కటిక శ్రీదేవి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు సర్వీసులు పెంచాలి

గణపవరం వాసుల వేడుకోలు

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రమైన గణపవరం నుంచి ప్రయాణాలు చేసేందుకు ఆర్‌టిసి బస్సు సర్వీసులు పెంచాలని స్థానికులు కోరుతున్నారు. 50 గ్రామాలకు కేంద్రంగా ఉన్న గణపవరం నుంచి భీమవరం, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, సత్తుపల్లి, చింతలపూడి, ద్వారకాతిరుమల, అశ్వారావుపేట వేయడానికి వీలుగా బస్సులు నడుస్తున్నాయి. గణపవరం నుంచి ఏలూరు వెళ్లేందుకు బస్సును భీమవరం డిపో నుంచి ఉదయం, సాయంత్రం సర్వీసులు నడేపేవారు. గత మూడేళ్లుగా గణపవరం నుంచి ఏలూరు వెళ్లడానికి బస్సు నిలిపివేయడంతో ఏలూరు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నారాయణపురం వెళ్లి అక్కడ నుంచి ఏలూరు వెళ్లాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెం నుంచి గణపవరం మీదుగా భీమవరం వెళ్లే బస్సులు రోజుకు ఆరు ట్రిప్పులు తిరగాలి. భీమవరం నుంచి గణపవరం మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సులు మూడు ట్రిప్పులు తిరగాలి. అనుకోని విధంగా బస్సులు మధ్యమధ్యలో ఒక ట్రిప్పు ఆపివేయడంతో ప్రయాణికులు గంటలసేపు బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సు రాత్రి సమయంలో బస్టాండ్‌కి వెళ్లకుండా వెళ్లిపోతుందని, దీంతో బస్టాండ్‌లో ఉన్న తమకు బస్సు అందుబాటులో ఉండడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమకు ఇబ్బంది లేకుండా బస్సు సర్వీసులు పెంచాలని కోరుతున్నారు. సరైన సమయానికి బస్సు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ప్రయివేట్ వాహనాలకు అదనపు ఛార్జీలు చెల్లించి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్‌టిసి అధికారులు గణపవరం నుంచి బస్సు సర్వీసులు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు చేనేత దినోత్సవం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల ఏడో తేదీ జాతీయ చేనేత దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించుకోవాలని మార్టేరుకు చెందిన జాతీయ చేనేత ఐక్య వేదిక యువజన అధ్యక్షులు అల్లాడ సూర్యభాస్కర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవ సంబరాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అన్ని స్కూళ్లలో అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

'పుంగనూరు అల్లర్లలో చంద్రబాబు ఎ1'

ప్రజాశక్తి - పాలకొల్లు

పుంగనూరులో చంద్రబాబు చేసిన అరాచకం దారుణమని, ఆయనను ఎ1 ముద్దాయిగా అరెస్టు చేయాలని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అరాచకం ద్వారా వచ్చే ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే టిడిపి వారు అరాచకం సృష్టించి రానున్న ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తున్నారన్నారు. ఆయనతో పాటు దేవస్థానం ఛైర్మన్లు కోరాడ శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, మోర్తా గిరీష్, నీలంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు. తొలుత స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు.

రహదారి నిర్మించాలని పాదయాత్ర

ప్రజాశక్తి - గణపవరం

అడవికొలను రహదారి నిర్మించాలని కోరుతూ జనసేన పార్టీ ఆధ్వర్యాన ఆదివారం బొబ్బిలి వంతెన వద్ద నుంచి పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవికొలను రహదారి 14 ఏళ్లుగా నిర్మించకపోవడంతో మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్డు నిర్మించడానికి రూ.5 కోట్ల మంజూరైనట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రను నిడమర్రు సిఐ సుభాష్ పోలీసులతో అడ్డుకోవడంతో శాంతియుతంగా పాదయాత్ర కొనసాగిస్తామని ధర్మరాజు చెప్పారు. దీంతో పాదయాత్ర కొనసాగింది. పాదయాత్రలో 300 మంది జనసైనికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడవికొలను పార్టీ అధ్యక్షులు నిమ్మల దొరబాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి గుండమోలు చినరత్తయ్య, తోటశ్రీను, తానేటి జోగేశ్వరరావు, ఎస్.అయ్యప్ప, జవ్వాది బాలాజీ, నిమ్మల మౌనిక, మద్దాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం, ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.